# కిటుకే



గన్నేపూడి రాధాకృష్ణమూర్తి

"ఏమిటలా వున్నావు?" చెమటలు కారుతూ నీరసంగా ఇంట్లోకి అడుగుపెడుతున్న భర్తను పరిశీలనగా చూస్తూ అడిగింది జానకి.

జవాబు చెప్పకుండా కుర్చీలో జారగిలబడి 'మంచినీళ్ళు' అన్నట్టు సైగచేశాడు హరి నిస్త్రాణగా.

మంచినీళ్ళు అందిస్తూ "ఏమైందీ? ఒంట్లో బాగాలేదా?" కొంగుతో ముఖం తుడిచి నుదుటిమీద చెయ్యిపెట్టింది జానకి. జ్వరం తగిలిన సూచనలు ఏమీ కనిపించలేదు.

"పిల్లలేరీ?" మంచినీళ్ళ గ్లాసు కిందపెడుతూ అడిగాడు హరి.

"ఆడుకోవటానికి వెళ్ళారుగానీ - ఇంతకూ ఏం జరిగిందో చెప్పవేం?" మనసులో ఎదుగుతున్న ఆలోచనని అణిచివేసే ప్రయత్నంలో జానకి.

"ఉద్యోగం.."

"ఆ .. ఉద్యోగం?" వాక్యం పూర్తి చెయ్యటానికి జానకి మనసొప్పలేదు.

"కంపెనీ నష్టంలో నడుస్తున్నదిట. అందుకని ఇరవై ముగ్గురిని పనిలో నుంచి తొలగించారు." స్థిమితం కూడతీసుకుంటూ వివరించాడు హరి. "ఆ ఇరవై ముగ్గురిలో నేనూ ఒకణ్ణి." అవాక్కయిపోయింది జానకి. ఒళ్ళు తిరుగుతున్నట్లనిపించి, గోడకు ఆనుకుని నిలదొక్కుకునే ప్రయత్నం.

"సారీ జానకీ! నా మూలాన మీ అందరికీ కష్టాలు.." హరి గొంతులో బాధ.

"తినేవాళ్ళం మా రాత అలా రాసిపెట్టి ఉంది." చీర కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ అన్నది జానకి. ఆ స్వరంలో బాధతోపాటు సూక్ష్మంగా నిష్ఠూరం ధ్వనించింది హరి చెవుల్లో.

"లేచి కాళ్ళూ చేతులూ కడుక్కురా. కాఫీ తాగుదువుగాని." తనను తాను సంబాళించుకుని, హరిని లేవదీసి తను వంటింట్లోకి నడిచింది జానకి.

"హరి సరిగ్గా చదువుకోనుంటే.." కాఫీ కలుపుతున్న జానకి మనసులో మథన. ఆ మాటే ఎప్పుడైనా తను హరితో అంటే "ఇప్పుడు పదేళ్ళు వెనక్కు వెళ్ళలేం గదా!" అంటాడు. "ఒకవేళ వెళ్ళగలిగినా - క్లాసులు ఎగ్గొట్టి మ్యాటినీ షోలు సాయంత్రాలు మిరపకాయ బజ్జీలు తింటూ టాంకుబండ్ మీద పచార్లు, శలవు రోజుల్లో గండిపేట, యాదగిరి గుట్ట పిక్‌నిక్‌లు - పబ్లిక్ గార్డెన్స్, ఇందిరా పార్కులో సీరియల్ కబుర్లు ఉండేవికాదు గద!" కాలేజీలో చదివే రోజుల్లో తనతో గడిపిన సమయాలు గుర్తు చేస్తూ. అసలు అందువల్లనే తను బి.కాం. సెప్టెంబరులో రాయవలసి వచ్చినట్టు - నవ్వులాటగానే అన్నా - హరి జ్ఞాపకం చేసిన సమయాలు లేకపోలేదు. "నీతోబాటు అవన్నీ తిరిగింది, కాలాన్ని గడిపింది నేనేగదా! మరి అదే పరీక్ష రాసి నేను పాసయ్యాను గదా!" అందామని చాలాసార్లు నాలిక చివరిదాకా వచ్చిన మాట - నోట్లోనే ఆగిపోయేది.

"ఈసారి నేను కూడా ఏదైనా ప్రయత్నం చేస్తాను.." కాఫీ కప్పు అందిస్తూ జానకి తన అభీష్టాన్ని మరోసారి వెలిబుచ్చింది.

"ఎందుకు జానీ... ఇప్పుడు నువ్వు వెళ్ళి ఉద్యోగం వెతికినా, చేసినా 'చేతగాక పెళ్ళాం సంపాదించి తెస్తుంటే తిని కూచుంటున్నా'డని జనం నన్ను తూర్పార పట్టటానికా?" ఈపాటికి హరి కోలుకుని మామూలు మనిషయ్యాడు. "ప్రయత్నిస్తాను. ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోతుందా!" అన్నాడు కాఫీ తాగుతూ.

జానకి కాఫీ తాగుతున్న హరిని పరిశీలించి చూస్తోంది. మొదటినుంచీ ఇదే వరస. పెళ్లవగానే "నేనూ ఉద్యోగం చేస్తాను హరీ. ఇద్దరమూ సంపాదిస్తే సంసారం సుఖంగా వెళ్లదియ్యవచ్చు" అంటే "నేనుండగా నువ్వెందుకు జానీ శ్రమ పడటం? హాయిగా ఇంట్లో కూర్చుని తీరిక సమయాల్లో నీ హాబీలు కొనసాగించు. సుఖపడటం నేర్చుకో!" అని తనను జోకొట్టాడు హరి. తను ఉద్యోగం చెయ్యాలనిపించినా, తను చదివిన చదువు వృథా అవుతున్నదే అని బాధవేసినా - హరి సహవాసం, సాహచర్యం తనను. గృహిణిగా తృప్తిపడేట్లు లాలించింది.

## పాపం కరీనా!



తన చుట్టూ తిరుగుతున్న **నిర్మాతలను** నానా తిప్పలు పెడుతున్న **కరీనాకపూర్** ఈ మధ్య జరిగిన ఓ **చేదు** అనుభవాన్ని జీర్ణించుకోలేక పోతోందట. హిందీలో మణిరత్నం తీయబోతున్న సినిమాకి ముందుగా వివేక్ ఒబెరాయ్, రాణీ ముఖర్జీ, బాబీడియోల్‌ని ఎంపిక చేసుకున్నారు. అయితే బాబీడియోల్‌కి జంటగా కరీనాకపూర్‌ని తీసుకోవాలని నిశ్చయించుకుంటే, 'కరీనా మాత్రం వద్దు' అని బాబి మొండికేశాడట. దాంతో కరీనాని తప్పించి మరొకర్ని తీసుకోబోతున్నాడు మణిరత్నం. ఇంతకీ బాబీడియోల్‌కి కరీనాకపూర్ అంటే ఎందుకంత కోపం? అని ఆరా తీస్తే 'అజ్నబీ' సినిమా సమయంలో బాబీడియోల్ అంటే లెక్క లేనట్లు ప్రవర్తించిందట కరీనా. ఆ కోపంతో 'ఆవిడ తప్ప ఇంకెవరైనా!' అని చెప్పాడు బాబి. దాంతో పాపం కరీనాకి ఓ మంచి సినిమా తప్పిపోయినట్లయింది.

తాము ఇద్దరే ఉన్నప్పుడు - బాబి పుట్టినదాకా ఏమీ కొరత తెలియలేదు. బాబి పుట్టినప్పటి నించీ డబ్బు కొదవ. ముళ్ళులా గుచ్చుకోవటం అరంభం అయింది. హరి అభిప్రాయం తెలిసినా రెండోసారి అడిగింది - 'తనూ ఏదైనా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తా'నంటూ. "నువ్వూ ఉద్యోగానికి వెళ్ళి, నేనూ ఉద్యోగానికి వెళ్తే బాబును ఎవరు చూసుకుంటారు జానీ! ఇద్దరమూ ఉండి వాడిని ఎవరూ లేనివారుగా పెంచుదామా? నా మనసందుకు ఒప్పుకోదు. ప్రస్తుతం కంప్యూటర్ పరిశ్రమ మంచి ఊపులోఉందిగదా. నేనే మరో మంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తాను." అని తనను మళ్ళీ నోరు మూయించాడు. సిలికాన్ వాలీలో కంప్యూటర్ బిజినెస్ అతివేగంగా పురోగమిస్తున్నది. మరో అమెరికన్ కంపెనీతో చెయ్యి కలిపి - కంపెనీ హెడ్‌క్వార్టర్ శానోసెకి తరలించారు. కంపెనీ బాటే కంప్యూటర్ ఇంజనీర్లు - ప్రోగ్రామర్లు వగైరా టెక్నికల్ టీం అంతా శానోసెకు బదిలీ అయి వెళ్ళిపోయారు. మిగతా అందరికీ నవ్వుతూ శలవు ఇచ్చి కంపెనీ తలుపు తాళం వేశారు. తిరిగి వచ్చినప్పుడు మళ్ళీ అందరినీ మర్చిపోకుండా కలుసుకుంటామని హామీ ఇస్తూ.

హరి ఉద్యోగం వేట తిరిగి మొదలయింది. తెలిసినవాళ్ళు, స్నేహితులు చెప్పిన చోట్లు, పేపర్లో ప్రకటనను చూచి దరఖాస్తులు, వాక్ ఇన్ ఇంటర్వ్యూలు - ఎక్కే గుమ్మం దిగే గుమ్మంలా నిర్విరామంగా ప్రయత్నించగా ఆరు నెలలకుగానీ మరో ఉద్యోగం దొరకలేదు. ఈలోగా జానకి పుట్టింటినించి, హరి తండ్రి దగ్గరి నుంచి, ముఖ్య స్నేహితుడు మురళి నుంచి అందిన సహాయం గాక, పెళ్ళిలో జానకికి పుట్టింటి వాళ్ళిచ్చిన గొలుసు, గాజులు తాకట్టుకు వెళ్ళాయి.

మురళికి తెలిసిన స్టీల్ స్టాకిస్ట్ ఆఫీసులో ఉద్యోగం దొరికింది చివరికి. స్టీల్ వ్యాపారం ముమ్మరంగా సాగినన్ని రోజులు చేతినిండా పని ఉండేది. టైం ప్రకారం కాక చేతిలో ఉన్నపని పూర్తి అయిన తర్వాతనే బయటికి వచ్చేవాడు హరి. స్టాకిస్ట్ హరి పనితనానికి కృషికి చాలా సంతోష పడ్డాడు. మురళికి ఫోను చేసి తనకు అంత మంచి వ్యక్తిని సిఫార్స్ చేసినందుకు ధన్యవాదాలు తెలుపుకున్నాడు. త్వరలోనే హరి



జీతం పెంచాడు. అదనపు బాధ్యతలు కూడా హరికి అప్పగించాడు. దాదాపు వ్యాపారం మొత్తం హరి చేతులమీదుగా నడిచేది. అంతా కొత్త తారు రోడ్డు మీద కొత్త మారుతీ కారులో వెళ్తున్నట్లుంది. కొత్త స్టీలు కంపెనీలు కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రలతో ప్రైవేటురంగంలో వెలిసినై. స్టీలు పరిశ్రమలో విపరీతమైన పోటీ తలెత్తింది. లాభాలు నానాటికీ సన్నగిల్లిపోతున్నాయి. అమ్మకాలు దిగజారిపోతున్నాయి. ఈ పోటీ తట్టుకోవాలంటే ఖర్చులు తగ్గించటమే మార్గమని తెలిసిన స్టాకిస్ట్ శాంతిలాల్ తన కొడుకును తీసుకు వచ్చి షాపులో కూర్చోబెట్టాడు. రెండు నెలల తర్వాత మెల్లిగా హరిని పిల్చి "హరి భాయ్ ఇండస్ట్రీలో కాంపిటీషన్ ఎలా పెరిగిపోతున్నదో నీకు తెలుసు గదా! గత మూడు నెలలుగా మన అమ్మకాలు ఎలా దిగజారిపోతున్నాయో నువ్వు చూస్తూనే ఉన్నావు గదా! లాభాల సంగతి అలా వుంచు - దివాళా తీసి మీ అందరి నోళ్ళూ కొట్టవలసివస్తుందేమోనని భయంగా ఉంది. అందుకు ఈ పరిస్థితుల్లో పెద్దజీతగాళ్ళను భరించే స్తోమతు లేదు నాకు. ఏమీ అనుకోకు. నువ్వేదైనా మరో ఉద్యోగం చూసుకో" అంటూ ఒక నెల జీతం చేతిలో పెట్టి నమస్కారం చేశాడు.

అనూహ్యంగా తగిలిన దెబ్బకు షాక్ తిన్నాడు హరి. ఏదైనా మరో ఉద్యోగం దొరికే వరకూ ఉండనివ్వమనీ, ప్రస్తుతం ఇస్తూన్న జీతం భారమనిపిస్తే ఎంతో కొంత తగ్గించుకుని ఇవ్వమనీ -అడగాలనీ తోచలేదు. తను ఇన్ని రోజులు నిర్వహించిన బాధ్యతలకు ప్రతిఫలంగా ఉన్న ఫళాన ఉద్వాసన పలికేసరికి పట్టరాని అవమానంతో కోపం గుండెలకు ఎగదన్నింది. దాంతో అహంభావం అభ్యర్థనకు అడ్డకట్ట వేసింది.

ఈసారి తను ఉద్యోగ ప్రయత్నం చేస్తానని జానకి అడిగినప్పుడు హరి మాట్లాడలేదు. మౌనం అంగీకారంగా జానకి ఉద్యోగ ప్రయత్నాలు ఆరంభించింది. ఏ ఇంటర్వ్యూకి వెళ్ళినా - బి.కాం. తర్వాత ఇన్ని సంవత్సరాలు ఏం చేశావు? ఉద్యోగం ఎందుకు చెయ్యలేదు? ఇంతవరకు ఏమీ అనుభవం లేదుగదా! కొత్తగా ఉద్యోగంలో చేరే పిన్నవయసువాళ్ళతో ఎలా సర్దుకు పోగలవు? ఇన్ని సంవత్సరాలు ఉద్యోగం చెయ్యని దానివి ఇప్పుడెందుకు చెయ్యాలనుకుంటున్నావు? బి.కాం. కాక మరేమైనా అర్హతలు సంపాయించావా? ఎందుకని ప్రయత్నం చెయ్యలేదు? అంటే దేనిలోనూ నీకు ఆసక్తి లేదనుకోవాలి? - వంటి సవాలక్ష ప్రశ్నలు వేసి చివర్లో - తర్వాత చెప్తాం అని పంపించేవారు. అందరూ ఇదే వరస.

హరి పరిస్థితి కూడా అలాగే ఉన్నది. ఎక్కడికి వెళ్లినా - ఇంతకు ముందు ఉద్యోగం ఎందుకు వదిలేశావు? అంతక్రితం మరో ఉద్యోగం కూడా వదిలేశావుగదా? ఎందుకని? ఈ ఉద్యోగానికి నీ అర్హత ఏమిటి? అదనపు అర్హతలు ఏమైనా ఉన్నాయా? కంప్యూటర్ కంపెనీలో పనిచేశావు కదా? కంప్యూటర్ భాష ఏదైనా నేర్చుకున్నావా? డేటా ప్రాసెసింగ్ తెలుసునా? అటువంటి సదవకాశం ఎందుకు వినియోగించుకోలేదు? లాంటి ప్రశ్నలతో ఊపిరి సలుపుకోనిచ్చేవారు కాదు. ఫలితం శూన్యం.

## కూంబింగ్

బట్ట కట్టుకోవటంతో
మొదలైన స్పృహ
బాంబులేసుకున్నపుడే మంట కలిసింది!
సామ్రాజ్యవాద కుమ్మరిపురుగు
శాంత్యహింసల్ని తొలుస్తుంటే
కర్మలుగా ఎన్నాళ్ళు భరిద్దాం?
మనుషుల మధ్య ఎడం పోవటం
స్పృహకే స్పృహరావటం!
చీకట్లో కోకలూడదీసుకునే అరాచకం
పట్టపగలు రవిక విప్పుకున్ననాడే
మానవతకి అబార్షనయింది!
అస్పష్టత రొచ్చుగుంటలో
వాదాలకి గేలంవేస్తూ కవిత్వం!
నాలుగురోడ్ల నడుమ ధర్మం చచ్చి
మైలస్నానం చేస్తూ సంఘం!
పెరిగే చెదును చైతన్యం ఆపేదెవరు?
కలుపు మొక్కను కలుపుకుపోయేదెవరు?
భూగర్భ జలాలు ఇంకిపోరాదు
సంస్కరణ సుమాలు వాడిపోరాదు!
అధికారానికి కనికరం లేదు
నాయకత్వానికి న్యాయకత్వం లేదు
ఎన్‌కౌంటర్లలో మానవత లేదు
విద్యాలయాల్లో విద్యార్థుల్లేరు
టీవీల్లో మూవీల్లో నిజాల్లేవు
ఖజానాలో కాసుల్లేవు
మొత్తంగా సంఘంలో విలువల్లేవు
ఇక 'కూంబింగ్' మొదలెడదాం

\- సశ్రీ'

* * *

"రా.. రా.. ఇంత ఆలస్యమైందేం?" అప్పుడే బార్‌లో ప్రవేశిస్తున్న హరిని ఆహ్వానిస్తూ చేయి చాపి నుంచున్నాడు మురళి. టేబుల్ దగ్గర మురళి ఒక్కడే కూర్చుని ఉన్నాడు. "నన్ను ఐదు గంటలకు రమ్మని ఏడింటి వరకూ కూర్చోబెట్టారు. వాళ్ళ ఎం.డి. ఏదో మీటింగ్‌లో ఉన్నాడుట. అయన వచ్చి ఇంటర్వ్యూ అయి బయటపడేసరికి ఈ వేళ అయింది. నేరుగా అక్కడినించే వస్తున్నా" బ్రీఫ్‌కేస్ పక్క కుర్చీలో పడేసి - మరో కుర్చీ తను ఆక్రమిస్తూ లోపలి మంటనంతా వెళ్ళగక్కాడు హరి.

"ఓకే! శాంతించు. ఏం తీసుకుంటావ్?" మురళి అనునయంగా అడిగాడు.


"నీకు తెలుసుగా. రం అండ్ కోక్."

బేరర్‌ను పిలిచి ఆర్డరు ఇచ్చి "ఊ.. ఇంతకూ ఇంటర్వ్యూ ఏమైంది?" హరి వాలకం ఫలితాన్ని మైకులోలా చెబుతున్నా కూతూహలంకొద్దీ అడిగాడు మురళి.

"ఏముంది? పాత పాటే. బి. కాం. తర్వాత ఇంకేమి అర్హతలు సంపాయించావు? కంప్యూటర్స్ గురించి ఏం తెలుసు? ఇంతకు ముందు ఉద్యోగం ఎందుకు వదిలేశావు?" నిరాశ, కోపం కలగలిపిన కోరలు లేని బుస.

బేరర్ డ్రింక్స్, చిప్స్, వేయించిన జీడిపప్పు - తెచ్చి, డ్రింక్స్ కలిపి డ్రింక్స్‌లో ఐస్ ముక్కలు వేసి, నిష్క్రమించాడు.

"జానకి ప్రయత్నాలు ఎలా వున్నాయ్?" ఛీయర్స్ చెప్పి, గ్లాసులో డ్రింక్ ఒక సిప్ చేసిన తర్వాత మురళి ప్రశ్న.



## ఆల్ ఉమెన్ పార్టీ



విదేశాలలో మన దేశంలో పెళ్ళి చూస్తే అక్కడ కట్టుబాట్లు అంటూ పెద్దగా ఉండవు. భార్యాభర్తలైనా సరే, ఎవరికంటూ వారికి విడిగా ఓ జీవితం ఉంటుంది. విదేశాలలో ఆడ, మగ ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ చాలా ఎక్కువగా ఉంటుంది. దీనితో పెళ్ళి అయిన మహిళలు సైతం బాయ్ ఫ్రెండ్స్‌తో డిస్కోలకు, సినిమాలకు, పార్టీలకు హాజరవుతుంటారు. ఇటీవల అమెరికాలోని మహిళలు పురుషులతో కాకుండా స్త్రీలు తమకై ఓ ట్రూప్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఆ ట్రూప్ పేరు 'ఆల్ ఉమెన్ పార్టీ'. వీరు తమ ట్రూప్‌లోని సభ్యులతో కలసి సినిమాలకు, డిస్కోలకు, క్లబులకు వెళుతుంటారు. అధిక స్వేచ్ఛతో విసిగిపోయిన అమెరికన్ భామలు కట్టుబాట్లను కోరుకోవడం ఆశ్చర్యంగా ఉన్నా ఈ ట్రూప్‌లో చాలా మంది వివాహితులే.

- ఎస్.బి

"తనూ అదే పడవ ప్రయాణం. అదీగాక తనకు ఇంతవరకూ ఏమీ అనుభవం లేదుగదా!"

మురళి సాభిప్రాయంగా తలాడించాడు. తర్వాత సంభాషణ క్రమంగా పత్రికలో వార్తలు, రాజకీయాలు, ముఖ్యమంత్రి ఏం తప్పులు చేస్తున్నాడు, ఎందుకు చేస్తున్నాడు, అసలు రాష్ట్రాన్ని, దేశాన్ని ఎలా ప్రగతిపథంలో నడిపించాలి, ఆటలు, క్రికెట్, టెండూల్కర్ ఇప్పటిదాకా గవాస్కర్ కొట్టిన సెంచరీస్ ఎందుకు మించలేకపోయాడు, ఎలా ఆడి ఉంటే ఈ పాటికి ప్రపంచంలో నంబర్ ఒన్ అయ్యేవాడు లాంటి చర్చ ఒక విషయం నించి మరో విషయంలోకి రిలే రేస్‌లా సాగిపోయింది.

డ్రింక్స్ రెండో రౌండ్ మొదలైంది.

"హరీ! నువ్వేమీ అనుకోనంటే ఒక మాట" అన్నాడు మురళి రెండో గ్లాసు సగంలో ఉండగా.

"మనిద్దరి మధ్య అనుకోవటమేమిట్రా! ఒకమాటగాదు ఎన్నైనా సరే, ఏదైనా సరే!"

"నువ్వూ జానకీ ఉద్యోగం వెతకటం ఆరంభించి ఇప్పటికి నాలుగు నెలలు అయిందా?"

"అవును" రమ్ సిప్ చేస్తూ సాలోచనగా హరి.

"ప్రస్తుతం ఉద్యోగాల్లో ఎంత పోటీ ఉన్నదో - ఉద్యోగం దొరకటం ఎంత కష్టంగా ఉందో నేను నీకు చెప్పనక్కర్లేదు."

"తెలుస్తూనే వుందిగా! ఇంకా చెప్పటమెందుకు?"

"కరెక్ట్. పోటీ ఎక్కువవుతున్నకొద్దీ బలవంతుడిదే రాజ్యం అనే సూక్తి ప్రబలం అవుతుంది."

"అంతేగద మరి!" హరి మరో సిప్ తీసుకుంటూ మురళితో ఏకీభవించాడు.

"అప్పుడే అనుభవంతోపాటు అదనపు అర్హతలు కూడా అవసరం అవుతాయి" మురళి అంచనా ప్రకారం వేసిన బౌన్సర్.

"వెళ్ళిన ప్రతిచోటా ప్రతివెధవా అడిగే ప్రశ్న ఇదే కద!" ప్రతి వెధవా - అన్న మాటతో హరి కడుపు మంట ప్రతిధ్వనించింది.

"అది వాళ్ళ తప్పంటావా? మార్కెట్‌లో దొరుకుతున్నప్పుడు నాణ్యమైన సరుకు సరసమైన ధరకు దొరికిందాకా వెతుకుతాం గదా! వాళ్ళూ అంతే.."

"అవుననుకో.." హరి మెత్తబడ్డాడు.

"ఇంతవరకూ నువ్వు అదనంగా అర్హతలు ఎందుకు సంపాదించలేదు. అని అడగటం లేదు నేను. అయిందేదో అయిపోయింది. దాన్ని తిరగతవ్వటం వృథా. నీకు తెలివితేటలకేం కొదవలేదు. తల్చుకుంటే నువ్వు ఏదైనా సాధించగలవు."

"ఓరే గురూ, నువ్వు నాకు బాకా ఊదుతున్నావేమిటి?" గ్లాసు ఎత్తి పూర్తిచేసి - ఖాళీ గ్లాసు టేబుల్ మీద చిన్న శబ్దంతో పెడ్తూ నవ్వాడు హరి.

బేరర్‌ని పిలిచి మరో రౌండ్ డ్రింక్స్ ఆర్డర్ చేసి "బాకా లేదు.. నీ మొహం లేదు. నువ్వు ఎం.కాం లేక ఎం.బి.ఏ లాంటి డిగ్రీలు ఎందుకు సంపాదించవు? ప్రైవేటుగా చదవ్వొచ్చుగదా! అప్పుడు ఇంతకంటె నిలకడ ఉద్యోగానికి అవకాశం ఉంటుంది గదా!"

"నువ్వు చెప్పింది రైటే బ్రదర్! కాని నా పరిస్థితి ఆలోచించు. ఉద్యోగం కోసం వేటాడటంలోనే నా ఓపిక, టైం హరించుకుపోతున్నాయ్. ఇంట్లో జానకిని చూస్తుంటే నాకెంత బాధగా ఉంటుందో తెలుసా? ఇన్ని కష్టాలు అనుభవించటానికా నన్ను కోరి చేసుకున్నది అని తనంటే విపరీతమైన జాలి కలుగుతుంది. ఇక బాబీని, బేబీని చూచినప్పుడు నా మనస్సు ఎంత క్షోభిస్తుందో నాకే తెలుసు. ఇంత బాధలోనూ ప్రతిరోజూ ఉద్యోగం కోసం వెతుకుతున్నాను నీకు తెలుసుగదా! జానకిని పిల్లల్ని పస్తుంచకుండా ఉండేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నాను. ఇంకో విషయం తెలుసా? ఇన్ని ఇక్కట్ల మధ్య ఇంకా నవ్వే ప్రయత్నిస్తున్నాను. తెలుసా?" గర్వంగా గ్లాసు ఎత్తి జైత్రయాత్రకు బయలుదేరుతూ శంఖం పూరించే యోధుడి పోజులో అన్నాడు హరి.

"నీ బాధ తెలుసు నాకు.. అందుకే.."మురళి మాటల్ని సగంలో త్రుంచేసి "తెలిస్తే నువ్విలా చెప్పవు బ్రదర్! ఇంతటి మథన అనుభవిస్తూ - జానకి, పిల్లలు పడే వేదన కళ్ళారా చూస్తూ నేను ఎలా చదవగలను? నాకు చదువు మీద ధ్యాస ఎలా కుదురుతుంది బ్రదర్!" వాపోయాడు హరి.

"అది నువ్వు ఆలోచించాల్సినవిషయం. నేనుగాని మరెవరైనా గానీ దారి చూపగలం. అంతవరకే. మన ఇద్దరి స్నేహాన్నిబట్టి చొరవ చేసి చెప్పాను. అంతే.."

"అరేయ్.. నువ్వుకాక నాకు ఇంకెవరు చెప్తారురా! అయినా చూడు - ఈ పరిస్థితుల్లో నేనెలా చదవగలను? నువ్వే చెప్పు! చదవటానికి ధ్యాస కుదుర్తుందా! కుదరదు బ్రదర్! నీకు తెలుసుగా! కుదరదు..."

* * *

మరో రెండు నెలల తర్వాత ఒక రోజు జానకి పెత్తల్లి కొడుకు ఇంటికి వచ్చాడు. జానకి కంటే రెండు సంవత్సరాలు వయసులో పెద్ద. చిన్నప్పటి బంధుత్వం. పరిచయమే గానీ తర్వాత ఎక్కువ రాకపోకలు లేవు. తన ప్రస్తుత పరిస్థితిలో అన్నయ్య చూడబోతున్నాడన్న అవమాన భారం జానకిని తొలచివేసింది. శ్యామమోహన్ - జానకి అన్న - ఇంటి పరిస్థితి గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు. విషయం తెలుసుకున్నాక హరిని కూర్చోబెట్టి అతను ఎక్కడెక్కడికి అప్లయ్ చేసిందీ తెలుసుకున్నాడు. వివరాలు ఒక కాగితం మీద రాసుకుని "జానీ ఇప్పుడే వస్తాను. కాఫీ చేసి ఉంచు" అని చెప్పి బయటికి వెళ్ళాడు.

"ఇప్పుడే వస్తా"నని వెళ్ళిన శ్యాంమోహన్ మూడు గంటల తర్వాత తిరిగి వచ్చాడు.

"సారీ బావగారూ! అవతల మనిషి దొరికేసరికి ఆలస్యం అయిపోయింది. బావగారూ రేపు మీరు ఫోన్ చేసి వెళ్ళి ఈ బి అండ్ సి కన్సల్‌టెంట్సుని కలవండి. వాళ్ళ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌తో మిమ్మల్ని ప్రసాదరావు గారు పంపించారని చెప్పండి, చాలు" అంటూ ఒక చిన్న కాగితం హరి చేతిలో ఉంచాడు.

"ప్రసాదరావుగారా.. మన పరిశ్రమల మంత్రి పేరు గూడా అదే!" హరి ప్రశ్నకు తన ఊహ జోడించాడు.

"కరెక్ట్.. ఆయనే" శ్యామమోహన్ జవాబు.

"ఆయన నీకెలా తెలుసు?" ఈసారి

ఆశ్చర్యపోవటం జానకి వంతు అయింది.

"అదే చిదంబర రహస్యం. అతనూ నేనూ బనారస్ హిందూ యూనివర్సిటీలో కలిసి చదువుకున్నాం. రెండు సంవత్సరాలు ఒకే హాస్టల్‌లో పక్కపక్క రూముల్లో ఉన్నాం."

"మరి ఇన్నేళ్ళ తర్వాత ఆయన నిన్ను గుర్తుపట్టారా?" జానకి అనుమానం.

"అలా అయితే ఇక స్నేహానికి విలువేముంది జానీ! బావగారు రేపు ఆ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌ని కలుస్తారు. నాలుగు రోజుల్లో ఉద్యోగంలో చేరిపోతారు" జానకి భుజం తట్టుతూ ధైర్యం చెప్పాడు శ్యామమోహన్.

"ఓహ్! థాంక్యూ శ్యాం. థాంక్యూ వెరీమచ్. నీ ఋణం ఎలా తీర్చుకోవాలో.." శ్యాం చేతులు రెండూ పట్టుకుని అన్నాడు హరి కన్నులు చెమర్చుతుండగా.

"థాంక్స్ నాకు కాదు జానీకి చెప్పండి. జానివల్లనే మీరు నాకు బావగారయ్యారు గదా! తర్వాత ఋణం అంటారా - ఈరోజు నా అతిథులై నాతో వచ్చి హోటల్‌లో భోజనం చెయ్యండి చాలు. ఇక లేచి తయారవండి."

* * *

హరి ఉద్యోగంలో చేరి వారం అయింది. ఆఫీసు నుంచి ఫోనులో మాట్లాడుకుని హరి, మురళి ఇద్దరూ వాళ్ళ మామూలు చోట కలుసుకున్నారు.

"మరోసారి హార్టీ కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు మురళి సంతోషంగా హరి చెయ్యి కుదిపేసి కౌగలించుకుంటూ.

"ఓహ్.. థాంక్యూ థాంక్యూ.. కానీ చెప్పానుగా ఇవాళ పార్టీ నావంతు. ఈరోజు బిల్లు నువ్వు చెల్లించు. జీతం రాగానే బాకీ తీర్చబడును. ఇది యాజమాన్యం తుది నిర్ణయం. ఇందులో ఎటువంటి వాదప్రతివాదనలూ అంగీకరించ బడవు" అన్నాడు నవ్వుతూ సీరియస్‌నెస్ రంగరించుతూ.

ఇద్దరూ నవ్వుతూ తుళ్ళుతూ లోకాభిరామాయణంలో ఉండగా - రెండో రౌండుకు వచ్చేసరికి "హరీ నువ్వు మరోలా అనుకోనంటే ఒక మాట.." గొంతు సవరించుకుంటూ ఆగాడు మురళి.

"మనిద్దరి మధ్య అనుకోటం ఏమిట్రా ఫూల్!" హరి సంతోషం మాటల్లోనే తెలుస్తున్నది. "గో ఆన్ మై బోయ్. ఒకటేమిటి ఎన్నైనా సరే.. అడుగు.." గిరీశం ఫోజులో అనుమతించాడు హరి.

"ఇంతకూ మునుపు కూడా ఒకసారి ఈ విషయం నీతో కదిపాను" గుర్తుచెయ్యటానికి ప్రయత్నించాడు మురళి.

"అబ్బా.. పాయింటులోకి రా.. పాయింటుకు.." రావు గోపాలరావు స్టైల్లో రెచ్చిపోయాడు హరి సంతోషంతో.

"వేళాకోళం కాదు. నీకు ఈ ఉద్యోగం దొరికినందుకు, నాకే కొత్త ఉద్యోగం దొరికినంత సంతోషంగా ఉంది.."

"థాంక్యూ.. నిజమైన స్నేహితుడంటే నువ్వేరా.." ఆప్యాయంగా మురళి వీపు తట్టుతూ అన్నాడు హరి.

"ఈ ఉద్యోగం రాక ముందు ఆరు ఏడు నెలలు నువ్వెంత అవస్థపడ్డావో నేనెరుగుదును."

"అంతా నీలాంటి స్నేహితుల చలవ.."

"అది సరే - ఇప్పుడైనా నువ్వు ఏదైనా ఆలోచించి మరో క్వాలిఫికేషన్ సంపాదిస్తే బాగుంటుంది గదా!"

"వాట్!" గొంతులో పోసుకోబోయే డ్రింక్ గాల్లోనే ఆపి ఏదో పిడుగుపడ్డట్లు స్తంభించిపోయాడు హరి.

"అదేరా ఎం.కాం., ఎం.బి.ఏ. లాంటి డిగ్రీ తెచ్చుకుంటే ఇంతకంటే మంచి ఉద్యోగం కోసం ప్రయత్నించవచ్చుగదా!" నచ్చచెప్పే ప్రయత్నంలో మురళి.

"బాయ్ ఇంకో లార్జ్ రం, సార్‌కు లార్జ్ విస్కీ" అని ఆర్డరు ఇచ్చి - "ఇప్పుడీ ఉద్యోగానికి ఏం తక్కువ?" కొద్దిగా ముద్దగా అన్నాడు హరి.

"ఏమీ లేదు. భవిష్యత్తుకు సిద్ధం కమ్మంటున్నాను. రాజులు, రాజ్యాలు లాగానే మంత్రులు, మేనేజింగ్ డైరెక్టర్లూ మారిపోవచ్చు.."

"రేయ్ మురళీ నేనిప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను. చదువూ చట్టు బండలూ అని నా మూడ్ చెడగొట్టకు. నాకు మందు దిగిపోతుంది. అయినా నీ వెర్రిగాని బంగారం లాంటి ఉద్యోగం చేతిలో ఉండగా ఇంకా మనకు డిగ్రీలెందుకు - నాలిక గీసుకోను! మందేసుకో.."

మురళికి అంతక్రితం ఎప్పుడో చదివిన జోక్ జ్ఞాపకం వచ్చింది. జోరున వర్షం కురుస్తోంది. రోడ్డు మీద వెళ్తున్న ఒక పెద్దమనిషి ఒక ఇంటి కిటికీలో ఒక వ్యక్తి కూచుని ఉండటం గమనించాడు. "ఎందుకు అక్కడ కూర్చున్నావ్?" అని ప్రశ్నించాడు.

"ఇల్లంతా కురుస్తోంది. ఇదొక్కటే పొడి చోటు" వివరించాడు కిటికీలో వ్యక్తి.

"బాగుచేయించకపోయావా మరి!" పెద్దమనిషి తిరుగు ప్రశ్న.

"ఇంత వర్షంలో ఎలా?" కిటికీ వ్యక్తి ఎదురు ప్రశ్న.

వర్షం తగ్గిన రెండు రోజులకు బాగా ఎండకాస్తున్న సమయంలో ఇద్దరూ తారసపడ్డారు.

"ఇల్లు బాగుచేయించావా?" పెద్దమనిషి ప్రశ్న.

"తెలివి తెల్లార - ఇప్పుడెందుకు?" కిటికీ వ్యక్తి ఎదురు ప్రశ్న.

*

## సోషల్ ఫోబియా



చాలా మంది రకరకాల ఫోబియాతో భయపడుతుంటారు. కొందరికి బల్లిని చూస్తే, మరికొందరికి బొద్దింకను చూస్తే, ఇంకొందరికి ఎలుకను చూస్తే భయం. నిజానికి అవి మనుషులను ఏమీ చేయవు. అయినా భయపడుతుంటాము. ఇందుకు కారణం తెలియని మానసిక రుగ్మత. దీని వలన పెద్దగా నష్టం లేదు. కానీ కొందరికి సోషల్ ఫోబియా ఉంటుంది. ఇది చాలా ప్రమాదకరమైనది. ఈ మానసిక రుగ్మత కలిగిన వారు నలుగురిలో కలిసి మెలగలేరు. ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. అయితే కొందరు మామూలు వ్యక్తులు కూడా మాట్లాడే, కలిసిపోయే గుణాన్ని తక్కువగా కలిగి ఉంటారు. ఇటువంటి గుణం వ్యక్తులలో శృతిమించితే దాన్ని సోషల్ ఫోబియా అంటారు. ఇటీవల కాలంలో సోషల్ ఫోబియాకు గురయ్యే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీనికి కారణం పెరిగిన వాతావరణం, కుటుంబ సభ్యులు. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగస్తులవడం, ఏకైక సంతానం అవడం కూడా కారణాలుగా పేర్కొనవచ్చు. సహజంగా ఉమ్మడి కుటుంబాలలో పెరిగిన పిల్లలకు సోషల్ ఫోబియా రావడం బహు అరుదు. చిన్న కుటుంబాలలో అదీ ఏకైక సంతానం అయినా, తల్లిదండ్రులు తమ సంతానాన్ని నిర్లక్ష్యం చేసినా ఈ సమస్య ఉత్పన్నమవుతుంది.' చిన్న వయస్సు నుంచే పిల్లలను సోషల్ ఫోబియాకు గురికాకుండా చూసుకోవాలి. ఒకవేళ అలా గురైతే మాత్రం మానసిక నిపుణుడి సలహా ప్రకారం వైద్య చికిత్సను అందించి పరిస్థితి చేయిదాటి పోకుండా చూసుకోవాలి.

**- నాగలక్ష్మి**